సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 13 । మే । 2024



వైభవంగా హరిహరుల రథోత్సవం
పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం హరి, హరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. - 8లో



కాలజ్ఞాని నడయాడిన నేల
కాలజ్ఞాని పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలకు బ్రహ్మంగారిమఠం సిద్ధమవుతోంది. ఈ నెల 14నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. - 8లో



జ్యువెలరీ షాప్‌లో మంటలు
రాయచోటి పట్టణంలోని జ్యువెలరీ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. భారీ నష్టం జరగలేదని ఫైర్ స్టేషన్ అధికారులు తెలిపారు. -8లో

ప్రగతికి చోటు.. భవితకు ఓటు

ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అనేది పాత మాట... ఏ వాడ చూసినా అడుగడుగునా అభివృద్ధి అన్నది నేటి మాట. ఒకప్పుడు గ్రామం మధ్యలో పాత బురుజు స్వాగతం పలికేది. కానీ ఇప్పుడు అదే పల్లెలో ముందు వరుసలో కనిపించే చూడచక్కని ప్రభుత్వ భవనాలు ప్రస్తుత పాలనా వ్యవస్థ పురోగతికి నిదర్శనం. ఉపాధి నిమిత్తం.. చదువుకోసం ఊర్లు వదిలి వెళ్లి నాలుగైదేళ్ల తర్వాత ఊరిలో అడుగు పెడుతున్న ప్రతి ఒక్కరిలో ఏదో తెలియని ఆనందం. ఇంతగా ఊరు మారిందా అని సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు.. గ్రామ సచివాలయానికి వస్తున్న ఉద్యోగులు, జనాల సందడి చూసి సంక్రాంతి పండుగ వచ్చినంత సంబరం కనిపిస్తోంది. అరటి పట్టలు కట్టకపోయినా.. మామిడి తోరణాలు కనిపించకపోయినా ఊరికి వచ్చిన పాత జనానికి కొత్త సందడి కళ్లెదుటే సాక్షాత్కరిస్తోంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ప్రతి చోటా ప్రగతి పరుగులు తీస్తోంది. ఇదంతా జగన్ సర్కార్ తీసుకొచ్చిన మార్పు అని తెలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు.

- అన్నమయ్య జిల్లాలో అగ్రభాగాన అభివృద్ధి
- అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు
- విద్య, వైద్యం, వ్యవసాయం, పట్టాల పంపిణీతో విప్లవాత్మక మార్పులు
- పథకాల వర్తింపుతో పేదలకు ఆర్థిక భరోసా
- మహిళల ముఖాల్లో కొత్త వెలుగులు తీసుకొచ్చిన జగన్ పరిపాలన



రాయచోటి- కడప రహదారిలోని రింగ్ రోడ్డు సర్కిల్‌లో సుందరంగా నిర్మాణమైన అన్నమయ్య సర్కిల్

సాక్షి రాయచోటి: రాష్ట్రంలో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలు అన్న తారతమ్యం చూడకుండా సంక్షేమ పథకాలకు అర్హత ఉందా...లేదా...అన్నది మాత్రమే చూస్తోంది. పారదర్శకంగా..లంచాలు లేకుండా నేరుగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అనే పథకంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 9450 కోట్ల మేర ప్రయోజనాన్ని పేద వర్గాల ప్రజలకు అందించారు. ఒక్కో నియోజకవర్గానికి రూ. 1500 కోట్ల మేర డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా అందించి కుటుంబం స్వతహాగా ఎదుగుదలకు ఊతమిచ్చింది. కులం, మతం, వర్గం, పార్టీలు ఇలా తేడా లేకుండా అందరికీ సంక్షేమ ఫలాలు అందించింది.

'అన్నమయ్య'లో అపార అభివృద్ధి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచి ప్రజలకు సంక్షేమం. జిల్లాలో అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రధానంగా జిల్లాలో పునర్విభజనలో భాగంగా రాజంపేట పార్లమెంటును జిల్లాగా మార్చి జిల్లా కేంద్రంగా రాయచోటిని ఎంపిక చేశారు. . మరోవైపు అంతే వేగంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారు. ప్రధానంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో రూ. 25 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండవ పైపులైన్ కోసం రూ.100 కోట్లు వెచ్చిస్తోంది. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రాయచోటిలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి సుమారు రూ. 100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా సుమారు రూ. 8 కోట్లతో శిల్పారామం, కేంద్రీయ విద్యాలయం, పీజీ కళాశాల, మరో రూ. 3 కోట్లతో నగరవనం, ఆటలకు సంబంధించి క్రికెట్ స్టేడియం, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి 50 ఎకరాల్లో ఎంఐజీ లే అవుట్, డబుల్‌రోడ్డు నిర్మాణాలు, మున్సిపాలిటీ పరిధిలో పార్కులు, నూతనంగా ఆర్టీసీ బస్టాండు, రైతు బజారు, సర్కిళ్లు, ఆర్ అండ్‌బీ అతిథిగృహం, టౌన్ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయం, ఇంకా అనేక రకాల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మదనపల్లెలో మూడు ఎకరాల్లో సుమారు రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల హైలెట్‌గా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కేంద్రీయ విద్యాలయం, మదనపల్లె వాసుల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న బీటీ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడం, సుమారు రూ. 200 కోట్లతో గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధితోపాటు ఇతర అనేక విధాలుగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పీలేరులో కూడా రూ. 24 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, వందలాది కోట్లతో పీలేరు–తిరుపతి జాతీయ రహదారి నిర్మాణ పనులు , రైల్వేకోడూరు పరిధిలో రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిలు, చిట్వేలి–రైల్వేకోడూరు ఫోర్‌లేన్ రోడ్డు, రాజంపేట పరిధిలో రూ. 80 కోట్లతో పింఛా ప్రాజెక్టును దాదాపుగా పూర్తి చేశారు. సుమారు రూ. 4 వేల కోట్లతో గండికోట నుంచి పుంగనూరు వరకు నీటిని తరలించేందుకు కాలువలు, ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే అన్నమయ్య జిల్లా జలకళతో పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా మారనుంది.

ఓటరు మహాశయా... ఒక్కసారి ఆలోచించు....

ఓటరు మహాశయులు ఒక్కసారి ఆలోచించాలి. అన్నీ తెలిసిన వారు ఎవరు మంచి చేస్తున్నారో, ఎవరు చెడు చేస్తున్నారో గుర్తించి విజ్ఞతతో ఓటు వేయాలి. పార్టీలను ఎంచుకోవడం మీ వంతు. అభివృద్ధి, సంక్షేమం అందాలంటే ఎవరైతే అందిస్తారో వారికి అండగా నిలబడాలి. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ ఇలా అన్నిరకాల పాలకుల పరిపాలనను చూసిన ఓటర్లు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి. ఓటు అనే ఆయుధంతో మంచి నాయకుడిని ఎంచుకుంటే పరిపాలనతోపాటు ప్రాంతం అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారు.

కరోనా కష్టంలోనూ.. కాపాడిన ప్రభుత్వం

కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పేదల సంక్షేమానికి పెద్దపీట వేసింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కంగారు పెట్టించింది. సమాజంలో మనుషులు కరోనాకు భయపడి ఒకరిని చూసి ఒకరు దూరం జరుగుతున్న పరిస్థితుల్లోనూ జగన్ సర్కార్ నేనున్నానంటూ అండగా నిలబడింది. కరోనా పాజిటివ్ బాధితులకు క్వారంటైన్‌లో అత్యుత్తమ వైద్యం అందించడం ఒక ఎత్తయితే, వారికి అక్కడే మాంసం, గుడ్లతో కూడిన పౌష్టికాహారం అందించడం, బాధితుడు కోలుకుని ఇంటికి వచ్చే సమయంలో డ్రై ఫ్రూట్‌తో కూడిన కిట్, ఒక్కొక్కరికి రూ. 2 వేలు నగదు అందించి కుటుంబానికి ప్రభుత్వం చేయూతనందించింది. అంతేకాదు...ఉచితంగా రేషన్‌కార్డుదారులకు బియ్యం, ఇతర సరుకులు అందించడం విశేషం. ఇంతటి విపత్కర పరిస్థితులు ఉన్నా....అప్పట్లో ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా పేదలు ఇబ్బందులు పడకూడదన్న సంకల్పంతో సంక్షేమ పథకాల విషయంలో చెప్పిన సమయానికే లోటు లేకుండా వారికి ఆర్థిక ఆసరా అందించడం ద్వారా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రతిపక్షంలోని పెద్దలు సైతం కనిపించకుండా పోయినా, పార్టీలతో పనిలేకుండా కరోనా సమయంలోనూ ప్రభుత్వం ఆదుకోవడాన్ని పలువురు ఇప్పటికీ చెప్పుకుంటున్నారు.

ఆ పాలన మాకొద్దు బాబు

టీడీపీ హయాంలో జరిగిన తప్పులను కూడా పలువురు చర్చిస్తున్నారు. జన్మభూమి కమిటీల పేరుతో అప్పట్లో పథకాలు రావడానికి పడిన వేదనను వివరిస్తున్నారు. అంతేకాకుండా అనేక రకాల అరాచకాలు సృష్టించి భయాందోళనల పరిస్థితులను గుర్తుకు చేసుకుంటున్నారు. ఏది కావాలన్నా జన్మభూమి కమిటీల పెత్తనంతో తమకు అందక అవస్థలు పడిన విధానాన్ని తలుచుకుంటున్నారు. ఆ పాలన ఇక వద్దు బాబూ అంటూ చెవులు కొరుక్కోవడం కనిపిస్తోంది.

ఓటు వేయడానికే వచ్చాను



నా ఊరు కమలాపురం పట్టణం. నేను దాదాపు 13ఏళ్లుగా హైద్రాబాద్‌లో ఉన్నాను. అక్కడే నేను ఇంట్రోఫ్రాగ్ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నెలకొల్పి సీఈఓగా ఉండి బిజినెస్ చేస్తున్నారు. అలాగే కార్ క్రాఫ్ట్ గ్యారేజ్ కూడా నిర్వహిస్తున్నాను. ఈ రోజే హైద్రాబాద్ నుంచి ఓటు వేయడానికి కమలాపురం వచ్చాను. నేను చదువుకున్న రోజుల్లో ఉండే పాఠశాలల పరిస్థితి, ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాల పరిస్థితి చూసి ఆశ్చర్యపోయాను. చాలా మార్పు వచ్చింది. -కె.రాజశేఖర్, సీఈఓ, సాఫ్ట్‌వేర్ కంపెనీ, హైదరాబాద్

చాలా అభివృద్ధి జరిగింది



నేను చెన్నైలో ఐదు సంవత్సరాల నుంచి జాబ్ చేస్తున్నాను. వేంపల్లెలో ఎంతో అభివృద్ధి జరగడం చాలా సంతోషంగా ఉంది. నేను చదువుకునే రోజుల్లో జిల్లా పరిషత్ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలు చాలా అధ్వానంగా ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాఠశాలలు అద్భుతంగా తయారయ్యాయి. ఇంత అభివృద్ధి జరిగిందంటే నేను నమ్మలేకపోతున్నాను. చాలా అద్భుతంగా ఉంది.
-నామా ప్రసాద్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, వేంపల్లె

బెంగుళూరు నుంచి ఓటెయ్యడానికి వచ్చాను



నేను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ఓటు వేసేందుకు మా ఊరొచ్చాను. ఈ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. గతంతో పోలిస్తే ఈ ఐదేళ్లలో మా ఊరు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. అభివృద్ధి చేసి చూపించిన నాయకుడికి అండగా ఉండటం మన బాధ్యత. ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకుందాం.
- నదీష్‌కుమార్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రాజుపాళెం మండలం

జిల్లాలో 42 మోడల్ పోలింగ్ కేంద్రాలు



రాయచోటిలో ఏర్పాటు చేసిన పీడబ్ల్యూడీ మోడల్ పోలింగ్ స్టేషన్

రాయచోటి: ప్రతి ఓటరును పోలింగ్ కేంద్రానికి రప్పించి ఓటుహక్కును వినియోగించుకోవాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం వివిధ విభాగాలకు చెందిన పేర్లతో మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని 32 మండలాల పరిధిలో 42 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్దింది. జిల్లాలోని 30 మండలాలతో పాటు రాజంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న (వైఎస్‌ఆర్ జిల్లాకు చెందిన) ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కలుపుకొని 42 మోడల్ పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి.

ఓట్ల పండుగకు వేళాయె!

- జిల్లాలోని ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాల్లో నేడే పోలింగ్
- జిల్లా వ్యాప్తంగా 14,12,266 మంది ఓటర్లు
- 1609 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 413 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తింపు
- రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు సెగ్మెంట్లలో పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- నేడు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహణ



సాక్షి రాయచోటి: ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పండుగ రానే వచ్చింది. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఓట్ల పండుగకు జనం సిద్ధమయ్యారు. దాదాపు 50 రోజులకు పైగా పార్టీ నేతల ప్రచారాలతో హోరెత్తిన పల్లెలు, పట్టణాలు పోలింగ్ కోసం ఎదురు చూస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రాజంపేట లోక్‌సభ, ఆరు శాసనసభ స్థానాల ఎన్నికల తుది సమరానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రాజంపేట లోక్‌సభకు 18 మంది, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు 80 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. జిల్లాలో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎక్కడికక్కడ హెడ్ క్వార్టర్ల నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో ఆదివారం ఉదయం ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వచ్చారు. అనంతరం అక్కడ ఎన్నికల సామగ్రిని తీసుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సులు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు. వీరి వెంట పోలీసు సిబ్బంది బందోబస్తుగా ఉన్నారు.

ఓటర్లు–పోలింగ్ కేంద్రాలు

అన్నమయ్య జిల్లాలో రాజంపేట లోక్‌సభ, ఆరుశాసనసభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. జిల్లా వ్యాప్తంగా 14,26,834 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 7,00,380 మంది కాగా, మహిళలు 7,26,327 మంది ఉండగా, ఇతరులు 127 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1609 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 413 కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించి అందుకు తగ్గ పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వుతో కలిపి బ్యాలెట్ యూనిట్లు 3874, కంట్రోల్ యూనిట్లు 3874, వీవీ ప్యాట్లు 4191 సిద్ధం చేశారు.

పోలింగ్ సిబ్బంది

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, నలుగురు ఓపీఓలను నియమించారు. మొత్తం 11,065 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. అందులో పీఓ, ఏపీఓ 3688 మంది ఉండగా, ఓపీఓలు 7377 మందిని నియమించారు. జిల్లాలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 1195 ఉండగా, 413 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్లతోపాటు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫొటో ఓటరు స్లిప్పులు గుర్తింపు కార్డులుగా పరిగణించరు. ఫొటో ఓటరు గుర్తింపుకార్డు లేకపోతే ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో కొత్తగా బ్యాలెట్ యూనిట్‌పై అభ్యర్థుల ఫొటోలు సైతం ముద్రించారు. వేసవి తాపం అధికంగా ఉండడం వల్ల పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, షామియాన, ఫర్నీచర్, టాయిలెట్స్, ర్యాంప్స్, నిరంతరాయ విద్యుత్ వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించి రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక వసతులు కల్పించారు. దివ్యాంగులు, మహిళలకు సంబంధించి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

జిల్లాలో మొత్తం ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు
రాజంపేట	2,41,200
రైల్వేకోడూరు	2,04,466
రాయచోటి	2,55,168
తంబళ్లపల్లె	2,24,802
పీలేరు	2,34,608
మదనపల్లె	2,66,590
మొత్తం	14,26,834

మూడు సెగ్మెంట్లలో 100 శాతం వెబ్ కాస్టింగ్

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 1358 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ అంటే దాదాపు 80 శాతానికి పైగా వెబ్ కాస్టింగ్ చేపట్టారు. మూడు నియోజకవర్గాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నారు. పోలింగ్ బూత్‌లలో ఏం జరిగేది కూడా కలెక్టరేట్ కంట్రోల్ రూము అధికారులతోపాటు విజయవాడ కేంద్రంగా ఎన్నికల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. రాయచోటిలోని 292 పోలింగ్ కేంద్రాలతోపాటు తంబళ్లపల్లె 236, పీలేరు 281 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా 271 పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ చేస్తున్నారు.

సార్వత్రిక సమరానికి నేడే పోలింగ్

అన్నమయ్య జిల్లాలో రాజంపేట పార్లమెంటు స్థానానికి 18 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ఆరు నియోజకవర్గాలకు సంబంధించి 80 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ప్రచార పర్వం ముగిసి మరికొన్ని క్షణాల్లో పోలింగ్ జరగనుంది. అందుకు సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని అధికారులు ప్రజలకు ఇప్పటికే పిలుపునిచ్చారు.

అలజడులు సృష్టిస్తే ఉపేక్షించం: ఎస్పీ కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

పీలేరురూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పని చేయాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక మయూరి కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అలజడులు సృష్టించినా వెంటనే అణచివేయాలన్నారు. పరిస్థితులు అదుపుతప్పుతున్నట్లు అనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల కమిషన్ అనుమతించిన వారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. నియోజకవర్గంలో 400 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా, ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. డీఎస్పీ రామచంద్రారావు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాజంపేట: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అన్నారు. ఆదివారం జనరల్ అబ్జర్వర్ ఓం ప్రకాష్, వ్యయ పరిశీలకులు ఎస్ జి మూన్, రవీందర్‌లతో కలిసి రాజంపేట పట్టణంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈయన వెంట రాజంపేట ఆర్‌ఓ మోహన్‌రావు ఉన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవీఎంలు తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈవీఎంల పంపిణీ అత్యంత పకడ్బందీగా జరగాలన్నారు పోలింగ్ రోజు ఎలాంటి చిన్న సమస్య తలెత్తకుండా పోలింగ్ నిర్వహించి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరన్నా.. ఇదే మా ఆహ్వానం

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఓటున్న ప్రతి ఒక్కరికీ ఇదే మా ఆహ్వానం అంటూ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేరున ఆహ్వాన పత్రాన్ని విడుదల చేశారు. ఈ ఆహ్వాన పత్రికలో 13వ తేదీన జరిగే ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్న పత్రం ప్రతి ఓటరును ఆకర్షించేలా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పండుగలో భాగంగా మే 13న అన్నమయ్య జిల్లాలో జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు కల్గిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

సిరాపై తప్పుడు ప్రచారం తగదు

చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై వారి ఇంటివద్దే మార్కు చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర రాష్ట్రంలో జరుగుతోందంటూ సోషల్ మీడియాలో జరగుతున్న ప్రచారం అవాస్తవమని జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందన్నారు. ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని మరెవరికీ అందుబాటులో ఉండదని స్పష్టం చేశారు. ఈ సిరా భారతీయ ఎన్నికల సంఘం వద్ద కాకుండా ఇతరుల వద ఉంటుందనేది తప్పుడు ప్రచారం అన్నారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కదిలిన యంత్రాంగం



పోలింగ్ సామగ్రితో మహిళా సిబ్బంది

సోమవారం జరగనున్న పోలింగ్ కోసం ఎన్నికల సామగ్రిని ఆయా నియోజకవర్గాలలో అధికారులు పంపిణీ చేశారు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, కోడూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి కేంద్రాలలో ఈవీఎంలు తీసుకునేందుకు పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఆదివారం ఉదయమే చేరుకున్నారు. ఎన్నికల సామగ్రిని అందుకున్న సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలీస్ బందోబస్తు మధ్య చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పీ కృష్ణారావులు వేర్వేరుగా పరిశీలించారు. -రాయచోటి





ఎన్నికల సామగ్రి తరలింపు కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్, ఎన్నికల సామగ్రితో పయనమవుతున్న సిబ్బంది

ఈదురు గాలుల బీభత్సం

– 60 ఎకరాల్లో నేలకొరిగిన అరటి పంట

పులివెందుల రూరల్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వీచిన ఈదురు గాలులకు సుమారు 60 ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు సంబంధించి సుమారు 60 ఎకరాల్లో అరటి పూర్తిగా దెబ్బతింది. పంట విలువ రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అజ్జుగుట్ట భాస్కర్‌రెడ్డి, యూత్ నాయకుడు కొమ్మ ఉమేష్‌రెడ్డి పరిశీలించారు. వివరాలను పులివెందుల మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చవ్వా దుష్యంత్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి రాఘవేంద్రారెడ్డిలకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎం.టి విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తుమ్మల సురేష్(38) నాగరాజుపేట– కాగితాల పెంట మార్గంలోని నారాయణ కళాశాల కూడలి సమీపంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు పరిశీలించేసరికి సురేష్ మృతి చెందాడు. 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సురేష్‌కు భార్య వరుణ, కుమార్తె జాహ్నవి వున్నారు. సురేష్ తన భార్య, కుమార్తెతో కలిసి వేంపల్లిలోని గాండ్ల వీధిలో నివాసం వుంటున్నాడు. గత ఆరు నెలల నుంచి కడపలోని ఏఆర్‌లో ఎం.టివిభాగంలో పనిచేస్తున్నాడు. ఎన్నికల విధుల సందర్భంగా కార్యాలయానికి వెళ్లి మధ్యాహ్నం భోజన సమయంలో సంఘటన స్థలం వద్దకు చేరుకున్నాడు. అప్పటికే తీవ్ర అనారోగ్యంతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. భార్యతో పాటు, కుటుంబసభ్యులు కడప ఒన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్యువెలరీ షాప్‌లో మంటలు



షాపు వద్ద గుమి కూడిన స్థానికులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని జ్యువెలరీ షాపులో విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో మంటలు రేగాయి. భారీ నష్టం జరగలేదని ఫైర్ స్టేషన్ అధికారులు తెలిపారు. రాయచోటి పట్టణంలోని కంసల వీధిలో ఉన్న విజయలక్ష్మీ జ్యువెలర్స్ (జానకీ రాం) షాపునకు యజమానులు ఆదివారం తాళాలు వేసి ఇంటి వద్ద ఉన్నారు. మధ్యాహ్నం ఇన్వర్టర్‌లో షార్ట్ షర్క్యూట్‌తో మంటలు రేగాయి. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఇంటి నిండా పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు యజమానులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అధికారులు తలుపులు తెరిచి చూడటంతో అప్పటికే రూ.2.5 లక్షల విలువగల ఎలక్ట్రికల్ వైర్లు, ఇన్వర్టర్, ఫర్నీచర్, ఇతర సామగ్రి కాలిపోయాయి. భారీ నష్టం జరగలేదని అధికారులు అంటున్నారు.

కాలజ్ఞాని నడయాడిన నేల



బ్రహ్మంగారిమఠంలోని క్షేత్రం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

- రేపటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు
- ఆరు రోజుల పాటు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాని, దైవ స్వరూపులు జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు బ్రహ్మంగారిమఠం సిద్ధమవుతోంది. ప్రపంచంలో ఏ వింత జరిగినా 'బ్రహ్మంగారు అప్పుడే చెప్పారు' అనడం మనం వింటుంటాం. అలాంటి మహిమాన్వితుడు సంచరించిన పుణ్యభూమి వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం. ఇక్కడే సజీవ సమాధి పొందిన వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

సన్మార్గంలో నడిపించడానికే..

మానవులకు జ్ఞాన బోధన చేసి, సన్మార్గంలో నడిపించడం కోసం వీరబ్రహ్మేంద్రస్వామిగా మహా విష్ణువు అవతరించారని భక్తుల నమ్మకం. ఆయన విశ్వబ్రాహ్మణ దంపతులైన ప్రకృతాంబ, పరిపూర్ణయాచార్యులుకు ఉత్తరప్రదేశ్‌లోని సరస్వతీ నదీ తీరంలో క్రీ.శ.1608లో జన్మించారు. వెంటనే తల్లిదండ్రులను కోల్పోయి అత్రి మహాముని ఆశ్రమంలో శిష్యుడిగా పెరిగారు. కర్ణాటక రాష్ట్రం పాపాగ్ని మఠం (ప్రస్తుతం చిక్‌బళ్లాపూర్ జిల్లాలోని కళవారహళ్లిలో ఉంది) మఠాధిపతులు యనమందల వీరభోజయాచార్య, వీర పాపమాంబ ఆయనను దత్తత తీసుకున్నారు. వీరభోజయాచార్య మరణించిన తర్వాత.. తన ఎనిమిదో ఏటనే లోక సంచార నిమిత్తం బయలుదేరుతారు. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తూ.. నంద్యాల జిల్లా బనగానపల్లెకు చేరుకున్నారు. అక్కడ గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంటిలో గోపాలకుడిగా ఉంటూ.. రవ్వలకొండలోని గుహలో కాల జ్ఞాన రచన చేశారు. ఆ తాళపత్ర గ్రంథాలు అచ్చమ్మ ఇంటిలో భద్రపరిచారు. యాగంటి గుహలో తపస్సు చేస్తూ ఆత్మ లింగాన్ని ప్రతిష్ఠించి లోక సంచార నిమిత్తం బయలుదేరారు.

దేశ నలుమూలలా సంచారం

ఆయన దేశ నలమూలలా సంచారం చేశారు. మైదుకూరు నియోజకవర్గం చాపాడు మండలం అల్లాడుపల్లెలో తాను శిల్పీకరించిన వీరభద్రస్వామి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కందిమల్లాయపల్లెలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మైలవరం మండలంలోని పెద్ద కొమెర్ల గ్రామానికి చెందిన శివకోటయాచార్య పుత్రిక గోవిందమాంబను వివాహం చేసుకోగా.. వారికి ఐదుగురు కుమారులు, కుమార్తె సంతానం. మహమ్మదీయ తెగకు చెందిన సిద్దయ్య, దళితుడైన కక్కయ్యను శిష్యులుగా స్వీకరించారు. శిష్య గణ సమేతంగా దేశ నలుమూలల సంచరించి వేదాంత తత్వ ప్రచారం చేశారు. కలియుగంలో పాపభారం అధికమైనప్పుడు తాను వీరభోగ వసంతరాయులుగా జన్మించి ధర్మ సంస్థాపనం గావిస్తామన్నారు. 85 ఏళ్ల వయసులో (1693) వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామిచే ప్రసిద్ధి పొందుట చేత కందిమల్లాయపల్లె తర్వాతి కాలంలో బ్రహ్మంగారిమఠంగా పేరు పొందింది.

భారీ ఏర్పాట్లు

స్వామి సజీవ సమాధి నిష్ఠ పొందిన వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఏటా ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఆరు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ నెల 14వ తేదీ నుంచి నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిషా, , మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల నుంచి అశేష భక్తజనం తరలిరానున్నారు. దేవదాయ శాఖ అధికారులు, మఠం నిర్వాహకులు, స్వామి శిష్య బృందం ఏర్పాట్లు చేస్తున్నారు.

దర్శనీయ స్థలాలు

బ్రహ్మంగారిమఠం సందర్శించిన భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి, కాలజ్ఞాన ప్రతులు, నివాస గృహం, స్వామి తవ్విన బావి, పోలేరమ్మతో నిప్పు తెప్పించిన రచ్చ బండ, ఈశ్వరీదేవి మఠం, కక్కయ్య మఠం, పోలేరమ్మ గుడి, రామాలయం (భజన మందిరం), అచలానందస్వామి ఆశ్రమం, మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, బ్రహ్మంసాగర్, ముదుమాలలోని సిద్దయ్యమఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం దర్శించుకోవచ్చు.



కాలజ్ఞాని రచించిన తాళపత్రాలు



బ్రహ్మంగారు నివసించిన ఇల్లు



స్వామి పోలేరమ్మతో నిప్పు తెప్పించిన రచ్చబండ

'ఉయ్ యాప్'తో ఓటర్ల 'ట్రాప్'

– ఎంసీసీ నిబంధనల ఉల్లంఘించిన టీడీపీ నాయకులు
– వన్‌టౌన్ సీఐకి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేతల ఫిర్యాదు

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ నాయకులు 'ఉయ్ యాప్' ద్వారా ఓటర్లను మభ్యపెట్టడమేగాక, అవసరమైతే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్ కడప జిల్లా వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగం నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగిరెడ్డి మాట్లాడుతూ 2019లో టీడీపీ సేవామిత్రలతో 'ప్రజా సాధికారిక సర్వే' ద్వారా పురుష, మహిళల గణన, ఓటర్ల జాబితాను తయారు చేయించారన్నారు. ఆ డేటాను ప్రస్తుతం 'ఉయ్ యాప్' ద్వారా టీడీపీ కార్యకర్తలు తమ బూత్ లెవెల్ కమిటీకి అందజేశారు. తద్వారా ఓటర్లను ట్రాప్ చేసి వ్యక్తిగత డేటా ద్వారా వారిని ప్రలోభపెట్టడం, వైఎస్సార్‌సీపీ అనుకూల ఓటర్లను బెదిరించడం, మభ్యపెట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. టీడీపీ వారు ఇచ్చే ఓటర్ల స్లిప్‌లలో 'క్యూ ఆర్ కోడ్'ను జతచేసి ఓటర్ల బ్యాంక్ ఖాతాలకు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా డబ్బు నేరుగా జమచేస్తున్నారని ఆరోపించారు. ఈ సంఘటనలపై 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్'(ఎంసీసీ) నిబంధనల క్రింద కేసును నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేగాక ఈ సంఘటనపై 171బి, 171సి, 171ఎఫ్, 379 ఆర్ /డబ్ల్యూ 120 బి ఐపీసీ, సెక్షన్ 66 బి అండ్ 72, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 126 ప్యూపుల్ రెప్రజెంటేషన్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సి. భాస్కర్‌రెడ్డి తలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరి కె. సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదులు సి. ధర్మారెడ్డి, ఏ. రవీంద్రనాథ్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



కడప ఒన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ విభాగం నాయకులు

వైభవంగా హరి, హరుల రథోత్సవం



వైద్య నాథుని రథాన్ని లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్) రథంలో కొలువైన కామాక్షి, వైద్య నాథస్వామి



లక్ష్మీ చెన్నకేశవుని రథోత్సవం (ఇన్‌సెట్) రథంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడు

వల్లూరు : పుష్పగిరిలోని కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం హరి, హరుల రథోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఉదయం కామాక్షి సమేతుడైన వైద్యనాథస్వామి రథంలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం శివ నామం స్మరిస్తూ భక్తులు పోటీపడి రథాన్ని లాగారు. కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకులు అఖిల్ దీక్షితులు తొలుత రథం వద్ద పూజలు చేసి, విశ్వక్సేనారాధనం, పుణ్యాహవచనం, రథ సంప్రోక్షణ, అభిషేకం నిర్వహించారు. రథ ప్రారంభ పూజ, వాస్తు పూజ, శాంతి, అష్టబలి, కుష్మాండబలి, ఉత్సవ మూర్తుల దేవతా రాధన, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం బంగారు ఆభరణాలతో అలంకార భూషితులైన లక్ష్మీ చెన్నకేశవస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆశీనులయ్యారు. దేవేరులతో కలిసి దర్శనమివ్వడంతో గోవింద నామాలను జపిస్తూ భక్తులు రథం గొలుసులను పట్టుకుని లాగారు. పుష్పగిరి మాడ వీధుల్లో భక్తులు కాయ కర్పూరాలను సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వైద్య నాథ స్వామి ఆలయంలో సనగరం విశ్వనాథ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారు. చెన్న కేశవ ఆలయంలో అరవ చెన్నారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి, కారం శెట్టి బాలయ్య కుటుంబ సభ్యులు, ఉభయ దారులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు

పుష్పగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి కామాక్షి వైద్యనాథ స్వామి, లక్ష్మీ చెన్నకేశవ స్వామి అశ్వ వాహనంపై దర్శనమివ్వనున్నారు.

కరవు నేల మురిసేలా

- గాలేరు నగరి–హంద్రీనీవా అనుసంధానం
- రూ.4,373.23 కోట్లతో పథకం నిర్మాణ పనులు
- 20 టీఎంసీల కృష్ణా జలాల సద్వినియోగం
- కొత్తగా 2 రిజర్వాయర్ల పనులు పూర్తి
- 2,48,150 ఎకరాలకు సాగుకు నీరు



పూర్తయిన కాలేటివాగు రిజర్వాయర్

బి.కొత్తకోట : ఉమ్మడి చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతం, ప్రస్తుత అన్నమయ్య జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల అనుసంధాన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పథకం ద్వారా జిల్లాకు 20 టీఎంసీల కృష్ణా నీరు సద్వినియోగం చేసుకోవాలన్నదే లక్ష్యం.

2021 జూలై, 4న ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లె వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికి ప్రభుత్వం రూ.5,030 కోట్లు మంజూరు చేయగా, రూ.4,373.23 కోట్లకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఈ అనుసంధాన పనులు పూర్తయితే హంద్రీనీవా ప్రాజెక్టు ఉప కాలువలు, ప్రధాన కాలువ, ప్రధాన రిజర్వాయర్లకు కృష్ణా జలాలు పుష్కలంగా చేరుతాయి. జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకంగా పిలవబడే ఈ పథకం ద్వారా గండికోట రిజర్వాయర్ నుంచి 13 టీఎంసీలు ప్రస్తుత అన్నమయ్య జిల్లాకు వినియోగించుకుంటారు.

రూ.1,100 కోట్లతో పనులు పూర్తి

20 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే లక్ష్యంతో రూపొందిన ఈ పథకం ద్వారా రెండు ప్రాజెక్టుల అనుసంధానం జరుగుతోంది. పది చోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి గాలేరు–నగరి ప్రాజెక్టు ప్రధాన కాలువ కిలోమీటర్ 56.000 వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి 2 వేల క్యూసెక్కుల నీటిని కాలేటి వాగు రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఇక్కడ నుంచి కల్లూరుపల్లె రిజర్వాయర్‌కు, ఇక్కడి నుంచి 1,550 క్యూసెక్కుల నీటిని వెలిగల్లు రిజర్వాయర్‌కు తరలిస్తారు. తర్వాత తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ కిలోమీటర్ 483.750లోకి 750 క్యూసెక్కులు తరలిస్తారు. వెలిగల్లు రిజర్వాయర్ నుంచి తంబళ్లపల్లె సమీపంలోని పెద్దేరు ప్రాజెక్టులోకి 800 క్యూసెక్కులు, అక్కడి నుంచి నాయునిచెరువుకు 800 క్యూసెక్కులు, నాయనిచెరువుపల్లె ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ కిలోమీటర్ 79.600 వద్ద నీటిని మళ్లిస్తారు. మొత్తం 10చోట్ల ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తారు.

55 కిమీ పైప్‌లైన్ పూర్తి

అనుసంధాన పనుల్లో భాగంగా 153 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు జరగాల్సి ఉండగా 55 కిలోమీటర్ల పనులు పూర్తి చేశారు. కాలువ పనులు 5.313 కిలోమీటర్లు పూర్తయ్యింది. 10 చోట్ల ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టగా అందులో ఒక పథకం పూర్తి కావొస్తోంది. చక్రాయపేట మండలం గండి వద్ద 5 కిలోమీటర్ల సొరంగం పనులు చేయాల్సి ఉంది. వెలిగల్లు ప్రాజెక్టులోకి నీటిని తరలించే కాలేటివాగు రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. కొత్తగా నిర్మించిన కల్లూరివారిపల్లె రిజర్వాయర్ పూర్తయ్యింది.

120 రోజులూ నీటి తరలింపు

ఈ పథకం ద్వారా మొత్తం 20 టీఎంసీల నీటిని 120 రోజుల్లో తరలించుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో 13 టీఎంసీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు దక్కుతాయి. పుంగనూరు ఉప కాలువకు 800 క్యూసెక్కులు తరలిస్తే 120 రోజుల్లో 13 టీఎంసీల నీరు తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు చేరుతుంది. 750 క్యూసెక్కులతో ప్రధాన కాలువకు 5 టీఎంసీల నీరు చేరుతుంది. ఈ పథకంతో పశ్చిమ మండలాల్లో 2,48,150 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుతాయి, భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.



సురభి గ్రామం వద్ద పైప్‌లైన్ పనులు



గండివద్ద సొరంగం పనులు


కృష్ణా జలాలతో చెరువులు నింపుతాం



ప్రాజెక్టుల అనుసంధాన పనులు పూర్తవగానే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని చెరువులకు కృష్ణా జలాలను తరలిస్తాం. ముదివేడు రిజర్వాయర్ నుంచి కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లోని చెరువులకు నీటిని అందించే ప్రణాళిక ఉంది. మిగతా మండలాలకు ఉప కాలువ ద్వారా నీటి తరలింపుపై అధ్యయనం చేయాల్సి ఉంది. కరువు రైతులకు శాశ్వతంగా సాగునీటి కష్టాలు తీరుతాయి.

– పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

ప్రాజెక్టు పూర్తికి సీఎం సహకారం



ప్రాజెక్టుల అనుసంధానం పనులు సత్వరమే పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డిలతో సమీక్షిస్తున్నాం.వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టుకు నిధుల ఇబ్బంది లేకుండా సహకారం అందిస్తున్నారు. పనులు పూర్తయ్యాక రాయచోటి నియోజకవర్గానికి తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుంది. సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టుతో అన్నమయ్యజిల్లా మొత్తం సస్యశ్యామలం అవుతుంది.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే


నీటిలో మునిగిన గ్రామం (ఫైల్)


గండి వద్ద పూడ్చివేతకు వేస్తున్న ఇసుక బస్తాలు(ఫైల్)


ప్రజలను పునరావాస కేంద్రానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎమ్మెల్యే

జల ప్రళయానికి రెండున్నరేళ్లు

- రాయలచెరువు కట్ట గండి
- కొండలపైకి పరుగులు తీసిన జనం
- గండి పూడ్చివేతతో ఆపద్బాంధవుడైన చెవిరెడ్డి
- ఇల్లు వదిలి వారం పాటు రాయలచెరువు కట్టపైనే తిష్ట


ప్రత్యేక హెలికాప్టర్ నుంచి ప్రజలకు పంపిణీ చేయడానికి తెచ్చిన నిత్యావసర సరుకులు, ఆహారం బ్యాగులను అన్‌లోడింగ్ చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి (ఫైల్)

రామచంద్రాపురం: అదొక జల ప్రళయం. ఎటుచూసినా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. పలు గ్రామాలు జల దిగ్బంధం. దీంతో పాటు రాయలచెరువుకు కట్ట తెగిందనే వార్త దావానలంలా వ్యాప్తించడంతో చెరువు దిగువ ప్రాంతాల ప్రజలు హడలిపోయారు. ఇతర ప్రాంతాలకు పరుగులు తీశారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్న పళాన రాయలచెరువు వద్దకు చేరుకున్నారు. రాయలచెరువు కట్టకు పడిన గండి పూడ్చేందుకు అక్కడే వారం పాటు రేయింబవళ్లు ఉండి పర్యవేక్షించారు. ఇక ప్రమాదం లేదని నిర్ధారణకు వచ్చాకే తిరిగి ఇంటికి వెళ్లారు.

వివరాల్లోకెళితే.. అది 2021 నవంబర్

మండలవ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో రాయలచెరువుకు గండికి పడింది. ఇది తెలియడంతో గ్రామాలను వరద నీరు ముంచెత్తుందనే భయంతో ప్రజలు కొండలపైకి పరుగులు తీశారు. పోలీసులు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాయలచెరువుపై తిష్ట వేసి కట్ట దిగువ గ్రామాల ప్రజలను తిరుచానూరు సమీపంలోని శ్రీ పద్మావతి నిలయం, రామాపురంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్, గంగిరెడ్డిపల్లెలోని ఏఈఆర్ ఎంబీఏ కళాశాల, కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయించారు. ప్రజలు కొండల్లో ఉండకుండా పునరావాస కేంద్రాలకు వచ్చేలా చర్యలు వారికి భోజన సదుపాయం కల్పించారు. మరోవైపు రాయలచెరువు ముంపునకు గురైన ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లడానికి మొగ్గు చూపలేదు. దీంతో అక్కడికి చేరుకుని చీకటి పడుతున్న లెక్కచేయకుండా మోకాలు లోతు నీటిలో నడిచి వారిలో ధైర్యం నింపారు. అక్కడి నుంచి వారిని సీ.కాలేపల్లె సచివాలయ పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతి కల్పించారు. అధికారులు, జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేసి రాయలచెరువుకు గండి పడిన ప్రాంతంలో నీటి ఉధృతిని తగ్గించడానికి యంత్రాల సహాయంతో మొరవ తీయించడంతో చెరువులో నీరు తగ్గింది. రాయల చెరువుకట్టకు పడిన గండిని పూడ్చడానికి ఆఫ్కాన్స్ సంస్థ ఇంజినీర్లను పిలిపించి బెర్మ్ విధానంలో గండి పూడ్చివేత పనులు చేయించారు. ఇందులో కొయ్యలు, ఇనుప కడ్డీలు నాటి లక్ష ఇసుక బస్తాలతో గండిని పూడ్పించారు. అందుబాటులో ఏది ఉంటే అది తింటూ, ఆరుబయట స్నానం చేస్తూ, తానే ఒక కూలీలా నిత్యావసర సరుకుల బస్తాలు దింపుతూ రాయలచెరువు ముంపు గ్రామాల ప్రజలకు వారం పాటు సేవలందించారు. ఇక తమకేమీ భయం లేదని భావించి ప్రజలు సురక్షితంగా వారి ఇళ్లకు చేరుకున్న తరువాతే ఆయన రాయలచెరువు కట్ట నుంచి తన ఇంటికి వెళ్లారు.


గండి వద్ద పూడ్చివేత పనులు (ఫైల్)


పనులు పూర్తయ్యే వరకు అక్కడే పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

‘తల్లీబిడ్డ’కు రక్ష

- హైరిస్క్ గర్భిణుల కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్
- తల్లి, పురుటి బిడ్డను ఇళ్లకు తరలించే బాధ్యత కూడా..
- ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం ఆస్పత్రులకు తరలింపు


కెవీబీపురంలోని మారు మూల గ్రామానికి తల్లీబిడ్డను క్షేమంగా చేర్చిన దృశ్యం


తిరుపతి ప్రసూతి ఆసుపత్రి నుంచి సొంత గ్రామానికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

జిల్లా సమాచారం

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు	29
డ్రైవర్లు 29 మంది	సిబ్బంది 32 మంది

సంవత్సరం	సేవలు
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్	
2022-23లో	10,172
2023-24లో	7,662
ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్త మార్పిడి సేవలు	9,890

తిరుపతి తుడా: ప్రసవం– మరో జన్మతో సమానమని పెద్దల మాట. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించేవరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉండాలి. రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ప్రభుత్వం వారికి సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు, పౌష్టికాహారం అందిస్తోంది. మరోవైపు ప్రసూతి మరణాలు మరింతగా తగ్గించడం పైనా వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. హైరిస్క్ గర్భిణులను డెలివరీ తేదీకి ముందే ఆస్పత్రులకు తరలించి వైద్యుల సంరక్షణలో ఉంచుతున్నారు. దీంతో పాటు తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం ఆస్పత్రులకు వెళ్లడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ తో ఉచిత రవాణా సేవలు కల్పిస్తోంది.

గుమ్మం వద్దకే వాహనం

గత ఏడాది ఆగస్టు నుంచి హైరిస్క్ గర్భిణులను ప్రసవం, ఐరన్‌సుక్రోజ్, రక్తమార్పిడి కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో తరలించడం ప్రారంభించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆశావర్కర్లు తమ పరిధిలో హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి తరలించాల్సి ఉన్నట్లయితే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా కో–ఆర్డినేటర్‌కు సమాచారమిస్తారు. సమాచారం అందుకున్న గంటల వ్యవధిలో వాహనం గర్భిణుల స్వగ్రామానికి చేరుకుని తీసుకెళ్తుంది. తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు ఐరన్ సుక్రోజ్, రక్తమార్పిడి అనంతరం, అలాగే ఆస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి తరలిస్తున్నారు.

గర్భిణులు ఇబ్బంది పడకుండా..

రక్తహీనతతో బాధపడే గర్భిణులు ఐరన్‌సుక్రోజ్ ఇంజెక్షన్, రక్తమార్పిడి కోసం సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. దీనికిగాను ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ ఇబ్బంది పడుతూ ఉంటారు. ఇక మారుమూల గ్రామాల్లో అయితే ప్రయాణ ఇబ్బందులకు భయపడి గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లడం మానేస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గర్భిణులను ఉచితంగా ఆస్పత్రులకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సేవలను ప్రవేశపెట్టింది. హైరిస్క్ గర్భిణులు ఈ సేవలను అత్యధికంగా ఉపయోగించుకుంటున్నారు.

బాలింతలు క్షేమంగా ఇంటికి

ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి బాలింతలను క్షేమంగా ఇంటికి చేర్చడం కోసం ఏర్పాటుచేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రభుత్వం మరింత బలోపేతం చేసింది. గతేడాది ఏప్రిల్‌లో 500 కొత్త ఎయిర్ కండిషన్డ్ వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాగా.. అందులో 29 వాహనాలను తిరుపతి జిల్లాకు కేటాయించారు. ప్రాథమిక వైద్యంతో పాటు సురక్షితంగా ఇళ్ల నుంచి ఆస్పత్రులకు, ఆస్పత్రుల నుంచి ఇళ్లకు చేర్చే పద్ధతులను ప్రభుత్వం తీసుకుంది. ఈ సేవల పట్ల గ్రామీణ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

కాయ్ రాజా కాయ్!

- వేలల్లో నుంచి లక్షల్లో పందేలు
- పలమనేరు, కుప్పంలో టీడీపీకి ఓటమి తప్పదంటూ పందేలు
- ఉమ్మడి జిల్లాలో స్థానాలపై సైతం




పలమనేరు: ఇప్పటివరకూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగులు జోరుగా సాగుతుండగా ఇప్పుడు పందెంరాయుళ్ల చూపు ఎన్నికలపై పడింది. పైగా ఈ పర్యాయం ఎన్నికల ఉత్కంఠ తారస్థాయికి చేరింది. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఈసారి కూడా పునరావృతమవుతుందనే సర్వేలు చెబుతుండటం, మరోవైపు వైఎస్సార్ సీపీని సింగిల్‌గా ఎదుర్కొనే ధైర్యం లేక టీడీపీ, జనసేన, బీజేపీ జత కట్టడం..ఓటర్లలో ఒకింత ఆసక్తి పెంచింది. ఆ తర్వాత ఏ పార్టీ మేనిఫెస్టో ఎలా ఉంటుందో అని చర్చకు తావివచ్చింది. తొలుత వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం, అందులో పథకాలను కొనసాగిస్తూ వాటి కి మరింత సొమ్ము పెంచారు. పథకాల వల్ల మంచి కలిగి ఉంటేనే ఓట్లేయండి..అని ‘మేము సిద్ధం’ సభల్లో అశేష జనవాహిని కోరారు. చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. తదుపరి ‘ప్రజాగళం’ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసి తమ ఇద్దరి ముఖచిత్రాలతో మేనిఫెస్టో విడుదల చేశారు. అయితే ఈ మేనిఫెస్టోకు తాము దూరమని బీజేపీ ప్రకటించడం వారికి శరాఘాతమైంది. ఫలితంగా మళ్లీ ఎప్పటిలాగే ప్రజలను దగా చేసేందుకు చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చారని జనంలోకి ఒక సందేశం వెళ్లినట్లైంది. జగన్ ఓ వైపు తన పరిపాలనలో చేసిన మంచి గురించి చెబుతూ ఓట్లను అర్థిస్తూంటే, ఎంతసేపూ జగన్‌ను ఓడించడమే ఎజెండాగా ప్రచారం చేయడం తప్పితే తమ పాలనలో ఏం చేశామనేది ప్రజలకు చంద్రబాబు చెప్పలేకపోయారు. ఎన్నికల చివరి అంకానికి వచ్చేసరికి పోటాపోటీగా ప్రచారాలు హీట్ బాగా పెంచాయి. అలాగే ఉమ్మడి జిల్లాలో బెట్టింగులు కూడా అదే తీరులో ఉంటున్నాయి. కొన్నిచోట్ల ఒకటికి మూడు రెట్లు, మరికొన్ని ఒకటికి ఐదు రెట్లు లెక్కన ఇవి సాగుతున్నాయి. సోమవారం ఎన్నికలు ముగియగానే వచ్చే ట్రెండ్ బట్టి బెట్టింగులు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఈసారి కుప్పంలో చంద్రబాబు ఓటమి తప్పదంటూ సైతం పందేలకు దిగుతున్నవారే ఎక్కువగా కనిపిస్తున్నారు.

కర్ణాటకవాసులు సైతం..

పొరుగునే ఉన్న కర్ణాటక వాసులు సైతం జిల్లాలోని ఎన్నికలపై లక్షల్లో బెట్టింగుకు దిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ములబాగల్, కోలారు, శ్రీనివాసపురం, కేజీఎఫ్, చింతామణిలో ఈ బెట్టింగులు భారీ స్థాయిలో జరుగుతున్నట్లు సమాచారం.

నీరు–చెట్టు అంతా కనికట్టు

- టీడీపీ పాలనలో చేసిన పనులే మళ్లీమళ్లీ చేసి నిధుల స్వాహా
- ఆ పార్టీ అధ్యక్షుడి నుంచి కార్యకర్త వరకు ప్రజాధనాన్ని దోచుకోవడానికే నీరు–చెట్టు
- చెక్‌డ్యాంల నిర్మాణాల్లో నాణ్యతకు పాతర
- శ్రీరంగరాజపురంలో 30 మీటర్లకో చెక్ డ్యాం
- కాలం చెల్లిన సిమెంటు.. ఒండ్రుమట్టితో నిర్మాణాలు
- కుప్పంలో ఒకే పని మూడు పర్యాయాలు చేపట్టిన వైనం
- రూ.300 కోట్లకుపైగా అవినీతి జరిగినట్లు అంచనా?




మరమ్మతులకు నోచుకోని పీలేరు మండలం గోలోనిగుంట కట్ట. (ఈ కట్టను బాగు చేసినట్టు బిల్లులు చేసుకుని స్వాహా చేశారు)


వడ్డిపల్లె మార్గంలోని సుద్దగుంట కట్టపై వేసిన తారురోడ్డు! (ఈ సుద్దగుంట కట్టను మట్టితో మరమ్మతులు చేసినట్లు బిల్లులు చేసుకున్నారు)

సాక్షి టాస్క్‌ఫోర్స్, తిరుపతి: టీడీపీ హయాంలో నీరు–చెట్టు పథకం ఆ పార్టీ నేతలకు కల్పవృక్షంలా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లో చెరువులు, కాలువలు పూడిక తీత, చెరువు కట్ట, చెరువుల అనుసంధానం, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాం పనుల్లో కోట్ల రూపాయలు దండుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పనులన్నీ టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, జన్మభూమి కమిటీ నాయకులే చేశారు. అయితే చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేసి రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారు.. నీరు–చెట్టు పనుల్లో భారీ ఎత్తున నిధులు స్వాహా అయ్యాయని అప్పట్లో విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినా ఫలితం శూన్యం.

వైఎస్సార్‌సీపీ రాగానే చెక్

2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారు. నీరు–చెట్టులో చోటుచేసుకున్న అక్రమాలను కొనసాగనీయకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల సమయంలో హడావుడిగా మంజూరు చేసుకున్న, ఎన్నికలకు ముందు మంజూరై ఇంతవరకు పనులు చేపట్టని వాటిని కూడా పరిశీలించి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా 2019 ఎన్నికల నాటికి పనులే ప్రారంభించని వాటిని, 25 శాతం పనులు కూడా చేపట్టని పనులను రద్దు చేశారు.

తమ్ముళ్లకు మేత

టీడీపీ హయాంలో నీరు–చెట్టు పథకం ద్వారా జిల్లాలో రూ.748 కోట్ల అంచనాతో 7,937 పనులు చేశారు. అందులో 5,490 పనులు పూర్తి చేయగా, 2,447 పనులు వివిధ దశల్లో ఉన్నట్టు లెక్కలు చూపారు. అయితే ఏళ్లు గడిచినా 329 పనులు ప్రారంభించలేదు. అవసరమైన చోట కాకుండా అవసరం లేనిచోట్ల పనులకు టీడీపీ నేతలు, కార్యకర్తలు నిధులు మంజూరు చేయించుకున్నారు. పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఉపాధి పథకం కింద తీసిన గుంతల్లోనే కొత్తగా పూడికతీత పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. వాటర్‌షెడ్ పథకం కింద జిల్లాలో ఏ నియోజకవర్గానికి మంజూరు కానన్ని నిధులు ఒక్క పీలేరుకు మాత్రం విడుదలయ్యాయి. పీలేరు పరిధిలో తలపుల, రేగళ్ల పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.13.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి ఏకమై స్వాహా చేశారు.

ఎన్నికల నగారా మోగాక

2019ఎన్నికల నగారా మోగడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే నీరు–చెట్టు కింద రూ.100 కోట్ల విలువ చేసే పనులకు అనుమతులు తెచ్చుకున్నారు. ఈ పనులన్నింటినీ టీడీపీ నేతలు, కార్యకర్తలే దక్కించుకున్నారు. హడావుడిగా పనులు నామమాత్రంగా ప్రారంభించారు. దీంతో అప్పట్లో జిల్లా వ్యాప్తంగా రూ.93 కోట్ల విలువ చేసే 348 పనులు నామమాత్రంగా కూడా పనులు చేసిన దాఖలాలు లేవు. నిధులు స్వాహా చేసేందుకే ఇలాంటి ప్రక్రియలు చేపట్టారని అప్పట్లో అధికారులు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు.


ఎగువవగుడ్రెడ్డి చెరువు, కట్టకు మరమ్మతులు చేసినట్లు చూపిన వైనం (అయితే పనులు చేసినట్లు చూపి నిధులు స్వాహా చేశారు)

పూర్తి వివరాలు

సంవత్సరం	మొత్తం పనులు	మంజూరు చేసిన నిధులు	పూర్తి చేసిన పనులు	చేసిన ఖర్చు మొత్తం
2014-2015	నిల్			
2015-2016	3079	రూ.136.62 కోట్లు	2,437	రూ.105.74 కోట్లు
2016-2017	2891	రూ. 226.83 కోట్లు	2239	రూ.139.60 కోట్లు
2017-2018	5,978	రూ. 650.28 కోట్లు	3,261	రూ. 275.60 కోట్లు

నీరు–చెట్టు పనుల్లో అగ్రిమెంట్ల నుంచే అవినీతికి ఆజ్యం పోశారు. పనుల కేటాయింపు విషయంలో జిల్లా స్థాయి అధికారి ఒకరు ఒకే రోజు సుమారు రూ.200 కోట్ల పనులకు సంబంధించి అగ్రిమెంట్ చేసిన విషయం తెలిసిందే.

- శ్రీరంగరాజపురం మండలంలో జరిగిన అక్రమాలు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచాయి. మండలంలో మొత్తం 312 పనులను గుర్తించగా.. అందులో చెక్‌డ్యాంలు, చెరువు పూడికతీత పనులు చేపట్టేందుకు రూ.32 కోట్లు కేటాయించారు.
- పద్మాపురం గ్రామంలో అప్పటి అధికార పార్టీకి చెందిన జెడ్పీటీసీ సభ్యుడు రుద్రప్పనాయుడు రూ.2.12 కోట్లతో 5 చెక్‌డ్యాం పనులు చేపట్టారు. ఈ చెక్ డ్యాంలను అప్పట్లో కేవలం 30 మీటర్లకు ఒకటి చొప్పున నిర్మించారు. ఆ పనుల్లోనూ నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ఒండ్రుమట్టితో కలిసిన ఇసుక, కాలం చెల్లిన సిమెంటుతో చెక్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టి నిధులు స్వాహా చేశారు. అలాగే చెరువుల్లో పూడికతీత పనుల్లో ఇలాగే చేతివాటం ప్రదర్శించారు.

ఆరంభం నుంచే అవినీతి

- పాలసముద్రం మండలంలో టీడీపీ నేత చేపట్టిన చెరువు పూడిక తీత పనుల్లో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. చెరువులో మట్టి తీసి తన రిసార్ట్ చుట్టూ చదును చేసుకున్నారు. వీటి ద్వారా సుమారు రూ.2 కోట్ల వరకు అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- వరదయ్యపాళెం మండలం, బత్తలవల్లం చెరువు కలుజు పనులు నాశిరకంగా చేపట్టారు. పాతగోడపై పైపైన పనులు చేసి కొత్తగా కలుజు నిర్మించినట్లు రికార్డులు సృష్టించారు.
- ఏర్పేడు మండలంలోని పల్లం, పంగూరు, జంగాలపల్లి, వికృతమాల, గోవిందవరం తదితర ప్రాంతాల్లో టీడీపీ నేతలు చేపట్టిన పనుల్లో భారీ ఎత్తున నిధులు స్వాహా అయ్యాయి. రూ.లక్ష పనికి రూ.5 లక్షలకు బిల్లులుపెట్టి నిధులు కాజేశారు.
- శ్రీకాళహస్తి పరిధిలోని ఎంపేడు, ఇలగనూరు, ముచ్చివోలు, కమ్మకండ్రిగ పరిధిలో జరిగిన పనులు నాసిరకంగా చేపట్టి నిధులు బొక్కేశారు. ఇది నిజమే అని ఉన్నతాధికారులు నివేదికలు సమర్పించినా, వాటిని తొక్కి పెట్టారు.
- పూతలపట్టులో నాలుగు చెరువు పనులు చేపట్టాల్సి ఉంటే.. ఆ పనులు నెల్లూరు జిల్లాకు చెందినవారు టెండర్ ద్వారా దక్కించుకున్నారు. పనులు ప్రారంభించిన సమయంలో స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారు.

పనులను కూడా అమ్ముకున్న ఘనులు

- నీరు–చెట్టు పనులు పార్టీ కార్యకర్తలకు ఇచ్చే అవకాశం ఉన్నా పడమటి ప్రాంతానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఒకరు కమీషన్లకు కక్కుర్తిపడి కడప జిల్లాలోని మరో టీడీపీ నాయకుడికి అప్పగించారు. అతని నుంచి పెద్దఎత్తున కమీషన్లు పుచ్చుకున్నారు. మరికొన్ని పనులను అదే మాజీ ఎమ్మెల్యే పీఏ ఒకరు స్థానిక నాయకుల నుంచి కమీషన్లు తీసుకుని కట్టబెట్టినట్లు మదనపల్లెకు చెందిన బీజేపీ నాయకులు బహిరంగంగా విమర్శలు చేశారు.
- కుప్పం నియోజకవర్గ పరిధిలో మొత్తం 574 చెరువులు ఉంటే 2016లో ఓసారి చెరువుల సంరక్షణ పథకం కింద, మరోసారి జాతీయ ఉపాధిహామీ పథకం కింద, ఇంకోసారి నీరు–చెట్టు పథకంలో మొత్తం 555 చెరువుల్లో పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి భారీ ఎత్తున నిధులు స్వాహా చేశారు.
- మదనపల్లె పరిధిలోని రామసముద్రం మండలంలో టీడీపీ నాయకులు చేసిన పనులను వారు మళ్లీ మళ్లీ చేసినట్లు రికార్డులు తయారు చేసి సుమారు రూ.10 కోట్ల వరకు బొక్కేశారు.
- నగరి పరిధిలో 15 చెరువుల కింద 40 చెక్ డ్యాంలు నిర్మించారు. అందులో 20కిపైగా చెక్ డ్యాంలు నాసిరకంగా నిర్మించారు. పుత్తూరు పరిధిలోని నందికోన చెరువు పనులు చేపట్టాల్సి ఉన్నా నాడు పట్టించుకోలేదు. అదే వీరప్పరెడ్డిపాళెం, నింద్ర మండలంలోని పాదిరిచెరువు, నగరిలోని అడవికొత్తూరు చెరువు పనులు చేపట్టాల్సిన అవసరం లేకపోయినా తూతూమంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేశారు. నీరు– చెట్టు పనుల్లో కోట్ల రూపాయలు నిధులు కొల్లగొట్టినట్లు విజిలెన్స్ అధికారులు నిగ్గుతేల్చడం గమనార్హం.